MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 168 | సోమవారం 19 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# బలమున్న నేతలు ఎక్కడ

## పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం పరార్..

## పులివెందులలో కనిపించని జగన్ ప్రభావం.. పలుచోట్ల వైసీపీకి అభ్యర్థులు కరువు



**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 19):**

వైఎస్సార్సీపీకి పట్టున్న నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో చేతులెత్తేశారు. పుంగనూరు, రాయచోటి, మైదుకూరు, ఎర్రగుంట్ల, దర్శి, పిడుగురాళ్ల, కమలాపురంలలో కనీసం చైర్మన్ అభ్యర్థులు కరువయ్యారు. పులివెందుల కార్పొరేషన్ లో 66 డివిజన్లు ఉంటే 12 చోట్ల మాత్రమే వైఎస్సార్సీపీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇకపోతే ఆ పార్టీ తరపున జమ్మలమడుగు మున్సిపాలిటీకి చైర్మన్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిర, అనంతపురం జిల్లా గుత్తి మున్సిపల్ చైర్ పర్సన్ గా అంజలి పేర్లను ఖరారు చేసినప్పటికీ వాళ్ళు నామినేషన్లు దాఖలు చేయలేదు. రాయచోటి, పులివెందుల తదితర ప్రాంతాల్లో నామినేషన్లు వేసేందుకు ఎవరైనా ముందుకు వస్తే రక్షణ కల్పిస్తామని, స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని పోలీసులు మైకుల ద్వారా ప్రచారం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ తన సాంప్రదాయ బలమైన ప్రాంతాల్లోనే అభ్యర్థులను నిలబెట్టలేకపోవడం రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైంది. ప్రత్యేకంగా పులివెందుల, పుంగనూరు, కమలాపురం, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల వంటి ప్రాంతాల్లో పార్టీ కనీసం చైర్‌పర్సన్, అనేక వార్డు స్థానాలకు నామినేషన్లు వేయలేకపోయింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన పులివెందులలో 12 డివిజన్లలో మాత్రమే వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పుంగనూరు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి కుటుంబం బలమైన ప్రాంతం. ఇక్కడ వైఎస్సార్సీపీ ఒక్క నామినేషన్ కూడా వేయలేకపోయింది. చైర్‌పర్సన్‌కు టీడీపీ అభ్యర్థులు మాత్రమే వేశారు. కమలాపురం నగర పంచాయతీ చైర్‌పర్సన్‌కు పార్టీ ప్రకటించిన మార్జుల కవిత నామినేషన్ వేయలేక పోయారు. టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారని వైఎస్సార్సీపీ ఆరోపణలు చేశారు. జమ్మలమడుగుకు చైర్‌పర్సన్‌కు పార్టీ అధికారికంగా ప్రకటించిన ఇందిర ( ఎమ్మెల్సీ రామసుబ్బా రెడ్డి సతీమణి) నామినేషన్ వేయలేదు. ఎర్రగుంట్లలో చైర్‌పర్సన్‌కు వైఎస్సార్సీపీ నామినేషన్లు లేవు. కూటమి అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. ఈ నెల 28న మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

# కూటమి అరాచక పాలన పట్ల విసుగు

**వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ తోపాటు, 62 మంది కార్పొరేటర్లను గెలిపించండి**

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి**

**నవోదయ కాలనీ టీడీపీ బూత్ కన్వీనర్ గాయత్రి తో పాటు పలుకుటుంబాలు వైయస్సార్ సీపీ లో చేరిక**




**అంకుశం న్యూస్అనంతపురం, అక్టోబర్19 :**

రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న మున్సిపల్, స్థానిక ఎన్నికల్లో ఓడిపోతామనే ఓటమి భయంతో కూటమి నేతలు ఎక్కడ చూసినా వైయస్సార్ సీపీ అభ్యర్థులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. సోమవారం అనంతపురం నగరంలోని నవోదయ కాలనీ టీడీపీ బూత్ కన్వీనర్ గాయత్రి తో పాటు 27,29 డివిజన్ లకు చెందిన పలు కుటుంబాలు ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ ల సమక్షంలో వైయస్సార్ సీపీ లోకి చేరారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంతతకు నిలయమైన అనంతపురం లో గత రెండున్నర సంవత్సరాలుగా దౌర్జన్యాలు, దోపిడీలు ఎక్కువైపోయాయన్నారు. రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని సామాన్యుల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారని విమర్శించారు. పేదల ఇల్లు, స్థలాలను లాక్కుంటున్నా పోలీస్ వ్యవస్థ ప్రేక్షక పాత్ర పోషిస్తుందని వాపోయాడు. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యంను ఎమ్మెల్యే అనుచరులు బ్లాక్ మార్కెట్ లో అమ్ముకుంటున్నారన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు తీరుకు అనంతపురం నగర ప్రజలు విసిగిపోయారని, నగరంలోని ప్రతి డివిజన్లోనూ వైయస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో వైయస్సార్ సీపీ -

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

**నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా**

**మైదుకూరులో మున్సిపల్ ఎన్నికలు వాయిదా**




**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 19):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈమేరకు ఆయన సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 28 జిల్లా ప్రజా పరిషత్‌ల పరిధిలో 659 జెడ్పీటీసీ స్థానాలకు, 659 మండల ప్రజా పరిషత్‌ల పరిధిలో 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 663 జెడ్పీటీసీ స్థానాల్లో నాలుగు, 9,858 ఎంపీటీసీ స్థానాల్లో 29 స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సుమారు 2.81 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా ప్రజా పరిషత్‌లకు 28 మంది రిటర్నింగ్ అధికారులు, 659 మండల ప్రజా పరిషత్‌లకు 687 మంది రిటర్నింగ్ అధికారులు, -

మిగతా2లో

# విజయవాడ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ విజయమే లక్ష్యం



**100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యం --**

**ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని**

**స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై కేశినేని చిన్ని, వంగవీటి రాధాకృష్ణ, బుద్ధా వెంకన్న, పట్టాభి కీలక సమావేశం**

**అంకుశం న్యూస్ విజయవాడ అక్టోబర్ 19**

విజయవాడ మహానగరంలోస్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని కూటమి నేతలు నిర్ణయించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కార్యాలయంలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, వంగవీటి రాధాకృష్ణ, బుద్ధా వెంకన్న, పట్టాభి సమావేశమై ఎన్నికల వ్యూహం, వార్డుల వారీగా ప్రచార ప్రణాళిక, అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ వంగవీటి రాధాకృష్ణ అభ్యర్థిత్వంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహంవిజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలోకి దిగడం కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని అన్నారు. - మిగతా2లో

## తిరుమలలో స్వర్ణరథంపై

# దేవదేవుడు వేంకటాద్రీశుడు






**శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తేరుపై మలయప్పస్వామి దివ్య విహారం**

**మంగళవాయిద్యాలు.. గోవింద నామస్మరణల నడుమ వైభవంగా స్వర్ణరథోత్సవం**

**అంకుశం న్యూస్ తిరుమల అక్టోబర్ 19**

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం తిరుమలలో స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణకాంతులతో మెరిసే బంగారు రథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. మంగళవాయిద్యాల నడుమ, గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమాడ వీధుల్లో స్వామివారి స్వర్ణరథ విహారం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. - మిగతా2లో

అంకుశం
సాయంకాలం దినపత్రిక
సోమవారం 19 అక్టోబర్ 2026

## కూటమి అరాచక పాలన పట్ల విసుగు

-మొదటిపేజీ తరువాయి

మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ తో పాటు 62 డివిజన్ లలో పోటీ చేస్తున్న వైయస్సార్ సీపీ కార్పొరేటర్లను గెలిపించాలనే దృఢ నిశ్చయంతో నగర ప్రజలు వున్నారన్నారు.
జగన్మోహన్ రెడ్డి కంటే ఎక్కువ సంక్షేమం అందిస్తామంటూ సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చి సంక్షేమం పథకాలను అమలు చేయకపోగా నిత్యవసర సరుకుల ధరలు అమాంతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వం నుండి సహాయక చర్యలు శూన్యమని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంపంగి రామంజినేయులు, నాయకులు చిరంజీవి, గుజ్జల నారాయణ, సంపంగి రవి కుమార్, సర్దార్, తిరుపాలు, శశిధర్ రెడ్డి,విజయ్, మధు,శ్రీరాములు,హుస్సేన్,సాకే రామంజినేయులు,నాగరాజు,ప్రభాకర్,దివాంజీ రావు, శివ శంకర, నారాయణ స్వామి,వెంకీ,ఆధామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..
## శాంతికి తాము సిద్ధమే

యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు. రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. "మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

# భారత్ ఫ్రాన్స్ కాదు..
# బంగ్లాదేశ్ అంతకన్నా కాదు



భారత్‌లో పాలన మార్పు కోసం కుట్ర జరుగుతోందన్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్, ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో భారత్‌లోని నిరసనలను పోల్చడం సరికాదని స్పష్టం చేసింది. దేశంలో ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలనే విశ్వసిస్తాయని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, భారత్‌లోనూ ఫ్రాన్స్, బంగ్లాదేశ్ తరహా పరిణామాలకు కుట్ర జరిగిందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించడంపై ఈ విధంగా స్పందించారు. భారత్‌లో జరుగుతున్న నిరసనలను ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లోని పరిణామాలతో పోల్చడాన్ని శశి థరూర్ తప్పుబట్టారు. భారత్ ఆ రెండు దేశాల్లాంటిది కాదని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన హింసాత్మక ఘటనలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని తెలిపారు. బస్సులు, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టడం వంటి చర్యలకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలకే ప్రాధాన్యం ఇస్తాయని చెప్పారు. తాను కూడా అటువంటి నిరసనల్లోనే పాల్గొన్నానని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడమే ప్రతిపక్షాల ఉద్దేశమని వివరించారు. హింసకు పాల్పడటం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం తమ విధానం కాదని స్పష్టం చేశారు.

### 'ఎన్నికల్లో పారదర్శకతే లక్ష్యం'

భారత్‌లో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్న ఆరోపణలను థరూర్ తోసిపుచ్చారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. తమ పోరాటం ప్రభుత్వాన్ని అక్రమంగా తొలగించడం కోసం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడటమే లక్ష్యమని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడం ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను సమీక్షించి, అన్యాయంగా తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితాల తయారీలో పారదర్శకత తప్పనిసరి అని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది. ఈ అంశాన్ని రాజ్యాంగపరమైన సమస్యగా చూడాలని థరూర్ పేర్కొన్నారు. దీనిని ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంగా చిత్రీకరించడం సరికాదని స్పష్టం చేశారు.

### భారత్-యూరప్ పోలిక సరికాదు: పవన్ ఖేడా

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు పవన్ ఖేడా కూడా భారత్‌లోని నిరసనలను యూరప్‌లో జరిగిన ఆందోళనలతో పోల్చడాన్ని తప్పుబట్టారు. భారత్, యూరప్‌లలోని పరిస్థితులను ఒకే గాటన కట్టలేమని వ్యాఖ్యానించారు. యూరప్‌లోని నిరసనలను ముస్లింలకు సంబంధించిన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ముస్లింలను హింసాత్మకులుగా, తీవ్రవాదులుగా, అనాగరికులుగా చూపించే కథనాలను ప్రోత్సహించడం ప్రమాదకరమని ఖేరా పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం ద్వారా భారత్‌లోనూ ముస్లింలను లక్ష్యంగా చేసుకునే వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. భారత్‌లో గతంలో జరిగిన కొన్ని నిరసనల సందర్భంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. సంఘ్ పరివార్‌కు చెందిన కొందరు వ్యక్తులు ముస్లింల వేషధారణలో కనిపిస్తూ అల్లర్లు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు, ఫ్రాన్స్‌లో అల్లర్లు, విధ్వంసం, దోపిడీ చోటుచేసుకున్న తరహాలోనే భారత్‌లోనూ కుట్రకు ప్రయత్నాలు జరిగాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. భారత్‌లో యువతను రెచ్చగొట్టి వీధుల్లో హింసను ప్రేరేపించేందుకు దేశ వ్యతిరేక శక్తులు, కొందరు రాజకీయ నాయకులు కలిసి ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. అయితే, భారత్‌లో ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధంగా ఇతర మార్గాల్లో అధికార మార్పిడికి ప్రయత్నించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. జార్జ్ సోరోస్ పేరును ప్రస్తావిస్తూ కూడా ఆయన విమర్శలు చేశారు.

## ఘనంగా జరిగిన దాండియా దసరా వేడుకలు



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 19** ధర్మవరం పట్టణంలో సాయి బాబా గార్డెన్స్ నందు మానస దాండియా మహోత్సవం -2౨26 అనే కార్యక్రమాన్ని మానస నృత్య కళాకేంద్రం వారు నిర్వహించందం జరిగింది...ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌ.శ్రీ తేజోమూర్తుల మురళీధర్ గారు (ఆర్టిస్ట్, రచయిత) , గౌ. శ్రీమతి శంకారపు జయశ్రీ గారు ( బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, స్టేట్ మహిళ ప్రెసిడెంట్, ఏపీ) మరియు గౌ.శ్రీ. బుల్ రెడ్డి గారు (రిచ్ కిడ్ మూవీ హీరో) మరియు ఆయన బృందం అంత కూడా విచ్చేయడం జరిగింది...వీరితో పాటుగా ధర్మవరం లోని యూటబర్స్ కూడా రావడం జరిగింది... ఈ కార్యక్రమంలో దాదాపుగా ఎన్నో వందలు మంది పాల్గొనడం జరిగింది... కార్యక్రమం ఇంత అద్భుతంగా జరగడం ఎంతో ఆనందదాయకం అని ఆర్.మానస తెలిపారు...

## తిరుమలలో స్వర్ణరథంపై దేవదేవుడు వేంకటాద్రీశుడు

-మొదటిపేజీ తరువాయి

మహిళల భక్తిశ్రద్ధతో స్వర్ణరథోత్సవం
స్వర్ణరథోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వర్ణరథాన్ని లాగడం విశేషం. బంగారు రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుంటూ భక్తులు గోవింద నామస్మరణ చేశారు.

### స్వర్ణరథ దర్శనం సకల శుభప్రదం

స్వర్ణరథోత్సవాన్ని దర్శించుకోవడం వల్ల శ్రీ మహాలక్ష్మీదేవి కటాక్షంతో సంపదలు, భోగభాగ్యాలు, భూదేవి అనుగ్రహంతో సమస్త ధాన్యసంపదలు, శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపతో సుఖసంతోషాలు, సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్వర్ణరథంపై స్వామివారి దివ్యదర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, దైవానుగ్రహంపై అచంచలమైన విశ్వాసాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, నన్నపనేని సదాశివరావు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విజయవాడ మేయర్ అభ్యర్థి
## వంగవీటి రాధాకృష్ణ విజయమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

వంగవీటి కుటుంబానికి విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేకమైన చరిత్ర, గుర్తింపు ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి తరఫున రాధాకృష్ణను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల అందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు.రాధాకృష్ణ యువకుడని, విజయవాడ మేయర్ పదవికి సరైన అభ్యర్థి అని అభిప్రాయపడ్డారు. ఆయన సుమారు రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. విజయవాడ చరిత్రలో రికార్డు స్థాయి మెజారిటీతో గెలిచేలా కూటమి నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి కూటమి నేతలంతా కలిసికట్టుగా ప్రతి వార్డులో పర్యటించి అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తారని వెల్లడించారు. ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. వార్డుల వారీగా అభ్యర్థుల జాబితా సిద్ధమైందని, కూటమిలో ఎక్కడా రెబల్ అభ్యర్థుల సమస్య ఉండదని తెలిపారు. టికెట్ ఆశించి అవకాశం దక్కని నాయకులతో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారితో చర్చించి అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని చెప్పారు. తమకు ఎవరూ పోటీ కాదని, ప్రజల కోసం పనిచేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న అవినీతి అంశాలను ఏబీ వెంకటేశ్వరరావు వెలుగులోకి తీసుకొస్తే బాగుండేదని ఎంపీ చిన్ని వ్యాఖ్యానించారు.
వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ
మేయర్ అభ్యర్థిగా ఎన్నికల వ్యూహంపై చర్చలు
విజయవాడ మేయర్ అభ్యర్థిగా కూటమి తరఫున బరిలోకి దిగుతున్న వంగవీటి రాధాకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార కార్యాచరణపై నేతలతో చర్చించారు. విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ఉన్న ప్రత్యేక గుర్తింపు నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వంపై కూటమి శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.
కూటమి ఐక్యతే విజయానికి బలం
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు. టికెట్లు ఆశించిన నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగడం ద్వారా కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. విజయవాడలో మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతో పాటు అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి విస్తృత ప్రచారం నిర్వహించడంపై నేతలు దృష్టి సారించారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

అదనంగా 1,374 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించనున్నారు.
పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 35,333 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,41,332 మంది ఇతర పోలింగ్ అధికారుల సేవలను వినియోగించు కుంటామని తెలిపారు.
35,333 పోలింగ్ కేంద్రాలు:
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 35,333 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో 9,966 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 9,186 అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 16,181 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు.
డిపాజిట్ ఎంత..
అభ్యర్థుల డిపాజిట్, ఎన్నికల వ్యయ పరిమితి
ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు డిపాజిట్ మొత్తం రూ.1,500 కాగా, ఇతర అభ్యర్థులకు రూ.3,000గా నిర్ణయించారు.
జెడ్పీటీసీ సభ్యులుగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు డిపాజిట్ రూ.3,000 కాగా, ఇతర అభ్యర్థులకు రూ.6,000గా నిర్ణయించారు. ఎన్నికల వ్యయ పరిమితి
ఎంపీటీసీ అభ్యర్థులకు రూ.4 లక్షలు, జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు.
మైదుకూరు మున్సిపల్ ఎన్నిక వాయిదా
నామినేషన్ కేంద్రాల వద్ద చిన్నపాటి ఘర్షణలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో మైదుకూరు మునిసిపాలిటి లోని కొన్ని వార్డులలో నామినేషన్ పత్రాలు చినిగిపోయినట్లు కడప జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించారు. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించి, మైదుకూరు మునిసిపాలిటి ఎన్నికలను వాయిదా వేసినట్లు వెల్లడించారు. అలాగే, కడపతో పాటు ఇతర జిల్లాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై కూడా సంబంధిత జిల్లా కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తదుపరి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మీడియా

## అభ్యర్థుల ఎంపికకు నాయకుల కసరత్తు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 19** ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యులను ఎంపిక చేసేందుకు రాజకీయ పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. గ్రామాల్లో మంచితనం ఉన్న అభ్యర్థుల కోసం అన్ని రాజకీయ పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు. ఇప్పటికీ ఏ పార్టీ ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలపలేదు. ఎంపీటీసీ జడ్పిటిసి లో ఎన్నికల్లో గెలు పొందితే సర్పంచ్ గా ఆ పంచాయతీలో గెలుస్తారని ఆశాభావంతో సర్పంచ్ అభ్యర్థులు ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది. ఎన్నికల లో పోటీ చేసే అభ్యర్థులు ఆర్థికంగా ఉండాల్సిన అవసరం ఉంది. డబ్బులు లేకుండా రాజకీయాలు చేయలేరని గ్రామాల్లో నీ ప్రజలు చర్చించుకుంటున్నారు. పార్టీ ఎవరిని అభ్యర్థులుగా ప్రకటిస్తుందా అనే ఆశాభావంతో అన్ని రాజకీయ పార్టీ నాయకులు వేసి చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో రాజకీయంగా అనుభవం ఉన్న వ్యక్తులు ఎంపీపీ జడ్పిటిసి అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నట్లు తెలిసింది.

## చెడుపై విజయం విజయదశమి

**లిమాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయ దశమి శుభాకాంక్షలు!**



**అంకుశం న్యూస్ అమరావతి అక్టోబర్ 19** విజయదశమి పండగను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండగే విజయదశమి అని ఆయన అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని శ్రీ వైయస్ జగన్ ఆకాంక్షించారు.

## వైసీపీకి షాక్..
## రాప్తాడు టీడీపీలోకి ముమ్మరంగా వలసలు...



**అంకుశం న్యూస్, రాప్తాడు, అక్టోబర్:19** రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సమరానికి టీడీపీ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతోంది. కేవలం అభ్యర్థుల ఎంపికకే పరిమితం కాకుండా, వైసీపీకి గట్టి షాక్ ఇస్తూ ముందుకు సాగుతోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో సోమవారం అభ్యర్థుల ఎంపికతో పాటు వైసీపీ నుంచి భారీ చేరికలు కూడా జరిగాయి. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు గుజ్జల సురేష్, వినోద్ కుమార్, చిన్న నారాయణ, మధుసూదన్, భాస్కర్ లతో పాటు మరో 25మంది క్రియాశీలక కార్యకర్తలు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. స్థానిక వైకాపా నాయకుడు సుధాకర్, ముక్తాపురం పంచాయతీ తెలుగుదేశం నేతల సమక్షంలో తరలివచ్చిన వైసీపీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. మరోవైపు అభ్యర్థుల ఎంపికలో భాగంగా ఇవాళ రాప్తాడు మండలంతో పాటు అనంతపురం రూరల్ లోని ఒక ప్రధాన క్లస్టర్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గం అంతటా ఏకపక్షంగా క్లీన్ స్వీప్ చేయడమే టార్గెట్‌గా ఈ సమీక్ష సాగింది. సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లతో పాటు స్థానికంగా ప్రజల్లో గట్టి పట్టున్న నాయకులను, కార్యకర్తల మద్దతు ఉన్నవారినే బరిలోకి దించుతున్నట్లు ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. స్థానిక నాయకత్వం పూర్తి సమ్మతితోనే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

## ప్రజల సమస్యకు స్పందన.. సొంత ఖర్చులతో
## అంబేద్కర్ కాలనీలో వీధి దీపాల ఏర్పాటు

**మొండి బ్రదర్స్‌కు సోమలాపురం అంబేద్కర్ కాలనీ ప్రజల కృతజ్ఞతలు**



**సోమలాపురం, అక్టోబర్ 19 ( అంకుశం న్యూస్):** సోమలాపురం గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో వీధి దీపాలు వెలగక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై మొండి బ్రదర్స్ స్పందించారు. మొండి నాగరాజు తన సొంత డబ్బులు ఖర్చు చేసి కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దసరా పండుగ సందర్భంగా అంబేద్కర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని గెట్టప్పతో కలిసి మొండి నాగరాజుకు ఫోన్ ద్వారా సమస్యను తెలియజేశారు. దీంతో నాగరాజు విద్యుత్ అధికారులతో మాట్లాడి, తన సొంత ఖర్చులతో వీధి దీపాలు వెలిగేలా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పంచాయతీ నిధుల ద్వారా వీధి దీపాల ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో, కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి నాగరాజు వ్యక్తిగతంగా ఖర్చు చేయడం గమనార్హం.
ఈ సందర్భంగా అంబేద్కర్ కాలనీ ప్రజలు మాట్లాడుతూ, తమ కాలనీలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సమస్యను తెలియజేయగానే స్పందించి, సొంత ఖర్చులతో వీధి దీపాలు వెలిగేలా చేసిన మొండి నాగరాజుకు, మొండి బ్రదర్స్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాన్ని గుర్తించి సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తమ కాలనీ సమస్యను పరిష్కరించడంలో సహకరించిన మొండి బ్రదర్స్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషి

**-,ఈనెల 21నుండి 23వ తేదీ వరకు నామినేషన్**

**-ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రవి**



**రాప్తాడు అంకుశం న్యూస్ అక్టోబర్ 19** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సమన్వయంతో కృషి చేద్దామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రవి పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, తహశీల్దార్ ఎస్.బి.చెన్నకేశవులు, ఎస్సై సి.గోవిందు, టీడీపీ, వైసీపీ, బీజేపీ, సీపీఎం పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి ఎం.రవి మాట్లాడుతూ చట్ట ప్రకారం నోటిఫికేషన్ లో ఉన్నట్టుగా ప్రతి ఒక్కరూ నడచుకోవాలన్నారు. ఎన్నికల్లో నామినేషన్ వేసే అభ్యర్థులు వేసేవారికి కులం సర్టిఫికెట్, ఇంటి పన్ను, ఇతర పత్రాలు ఉండాలన్నారు. ప్రతి నామినేషన్ పత్రం పక్కాగా పూరించాలని, ఏవైనా సలహాలు కోసం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు 15.04.2026వ తేదీ ఓటరు జాబితా ప్రకారం ఎన్నికలు జరుగుతాయన్నారు. ఒక జడ్పిటిసి, 11 ఎంపీటీసీ స్థానాలకు మండల వ్యాప్తంగా 44 పోలింగ్ స్టేషన్ల బూతులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ముగిసిన అనంతరం జెఎన్టీయూ స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తాము. ఎంపీటీసీగా పోటీ చేసే అభ్యర్థికి మండలంలో ఎక్కడ నుంచైనా పోటీ చేయవచ్చుని, ప్రతిపాదకునికి ఓటు ఇదే మండలంలో ఉండాలన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితోపాటు ప్రతిపాదకుడు, మరో వ్యక్తి అనుమతిస్తామన్నారు. ఎస్సై గోవిందు మాట్లాడుతూ అతిసమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ అధికారులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉండాలన్నారు. ఎవరైనా చట్ట నిబంధనలను అతిక్రమిస్తే తక్షణమే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**రేపటి నుంచి 23నామినేషన్**

ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి రేపటి నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ వేసేందుకు గడువుందన్నారు. ఈనెల 24వ తేదీఉంటుందని, ఉపసంహరణకు గడువు అక్టోబర్ 27వ తేదీ వరకు ఉంటుందన్నారు. నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న కౌంటింగ్, ఫలితాలు ఉంటాయన్నారు. ఎంపీటీసీలకు ఎన్నికల ఖర్చు రూ.4 లక్షలు, జడ్పిటిసీలకు ఎన్నికల ఖర్చు రూ.8 లక్షలుగా ఉందన్నారు.

# మండపేటలో చెప్పాం చేస్తున్నాం పోస్టర్ ఆవిష్కరించిన ఎలక్షన్ ఇన్‌ఛార్జ్ దేవినేని

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేది కూటమి ప్రభుత్వం**

**సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్ర పునర్నిర్మాణం**



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 19:** 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన అపారమైన నమ్మకాన్ని నిలబెట్టేలా ఇచ్చిన ప్రతీ హామీని పారదర్శకంగా అమలు చేస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా ఎలక్షన్ ఇన్‌ఛార్జ్ దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న తీరును వివరిస్తూ రూపొందించిన "చెప్పాం... చేస్తున్నాం..." ప్రత్యేక పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై అచంచలమైన విశ్వాసంతో ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేట్, 56 శాతం ఓట్ షేర్‌తో కూటమిని చారిత్రాత్మక విజయం సాధించేలా దీవించారని ఆయన గుర్తుచేశారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటుకు పరిపూర్ణమైన న్యాయం చేసేలా, వారి తీర్పును శిరసావహించి కూటమి ప్రభుత్వం నిత్యం శ్రమిస్తోందని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతీ ఒక్కటీ క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని చెప్పారు. 'సూపర్ సిక్స్' పథకాలను సమర్థవంతంగా అమలు చేసి సూపర్ హిట్ సాధించామని, సంక్షేమం – అభివృద్ధి – సుపరిపాలన అనే మూడు సూత్రాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా అన్ని వర్గాలకూ న్యాయం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ అభివృద్ధి వెలుగులు నింపుతూ, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ప్రజల సహకారం భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఈ అభివృద్ధి, సంక్షేమ పరంపర మరింత వేగంగా ముందుకు సాగాలంటే రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను ఘనంగా గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, జిల్లా టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, అమలాపురం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగబాబు, సిరింగి ఈశ్వరరావు, మల్లిపూడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## మీ తాటాకు చప్పుళ్లకు టీడీపీ భయపడదు.

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**అంకుశం న్యూస్ నంద్యాల అక్టోబర్ 19** నంద్యాలలో ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని, అయితే సోమవారం నామినేషన్ల పరిశీలన సమయంలో తమ అభ్యర్థిపై దాడి జరగడం బాధాకరమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పరిణామాలపై ఆమె తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ల పరిశీలన సమయంలో వైసీపీ నాయకులు కొందరిని లోపలికి తీసుకువచ్చి టీడీపీ అభ్యర్థుల నామినేషన్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాము కూడా వైసీపీ అభ్యర్థులపై అభ్యంతరాలు వ్యక్తం చేయగలమని, అయితే ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశంతో సంయమనం పాటించామని తెలిపారు.

**రౌడీయిజానికి భయపడే వాళ్లం కాదు**

గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని తాము భావించామని, అయినప్పటికీ తమ అభ్యర్థిపై దాడి జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆరోపించారు. రౌడీయిజం చేస్తే భయపడతామని ఎవరూ అనుకోవద్దని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తనపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆమె గుర్తుచేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంయమనం పాటిస్తూ, ఎన్నికలు న్యాయబద్ధంగా జరగాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతోనే వైసీపీ ఎన్నికల్లో అల్లర్లు, దాడులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.

**మహిళలు, అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నాం**

మహిళలపైనా, కౌన్సిలర్ అభ్యర్థులపైనా దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని ఆమె అన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నప్పుడు బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే నిబంధనల ప్రకారం, నిష్పక్షపాతంగా పోటీ చేయాలని సూచించారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తలు, అభ్యర్థులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హెచ్చరించారు.

## విజయవాడలో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

**ని కలసిన మంత్రి సత్య కుమార్ యాదవ్, సినీ నటుడు విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న....**



**అంకుశం న్యూస్, ఆంధ్రప్రదేశ్, అక్టోబర్ : 19** విజయవాడలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ మోహన్ యాదవ్ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ కలిసి నటించి ఇటీవల విడుదలైన "రణబలి" చిత్రం గురించి మంత్రి తో ముచ్చటించారు. చిత్ర విశేషాలను పంచుకున్న దంపతులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## విడపనకల్‌లో ఘనంగా 76వ ఉర్సే ఖాదిరీ షంషేర్ ఊరేగింపు



**అంకుశం న్యూస్ విడపనకల్ అక్టోబర్ 19 :** అనంతపురం జిల్లా విడపనకల్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ షా మొహియుద్దీన్ పీర్ ఖాదిరీ రహ్మతుల్లాహి అలైహి వారి 76వ వార్షిక ఉర్సే ఖాదిరీ వేడుకల్లో భాగంగా 3వ రోజు సోమవారం షంషేర్ ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా షంషేర్ ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామ ప్రజలు, ముస్లిం సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సే ఖాదిరీ వేడుకలు మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల ద్వారా ప్రజల్లో ఐకమత్యం, సేవాభావం, పరస్పర గౌరవం మరింత పెంపొందుతున్నాయని పేర్కొన్నారు.

ఉర్సే ఖాదిరీ కార్యక్రమాల నిర్వహణలో సహకరించిన గ్రామ పెద్దలకు, భక్తులకు, దాతలకు, సేవకులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## దసరా సందర్భంగా ధర్మవరంలో దాండియా మహోత్సవం!



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 19** మానస నృత్య కేంద్రం వారి దాండియా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వాహకురాలు ఆర్. మానస ఆధ్వర్యంలో ఈ మహోత్సవం జరిగింది.కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీ మతి సంకారపు జయశ్రీ మాట్లాడుతూ కళలు నృత్య ప్రతిభ మానస నృత్య నిర్వాహకురాలు ఆర్ మానస చేస్తున్న సేవా ప్రతిభ గొప్పదని దసరా దేవీ నవరాత్రి సందర్భంగా నిర్వహించడం విశేషం అన్నారు. వారికి ఆమె దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పలువురు కళాకారిణిలు పాల్గొన్నారు.

## చెప్పాం.. చేస్తున్నాం ఇదే నినాదంతో పోస్టల్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 19:** అనపర్తి టిడిపి కార్యాలయంలో చెప్పాం చేస్తున్నాం కార్యక్రమం సంబంధించిన కర పత్రాన్ని ఆవిష్కరించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..2024 ఎన్నికల్లో కూటమి ఏవిధంగా ఐకమత్యంగా వెళ్ళిందో ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోడానికి కూడా అదే ఐకమత్యంతో ముందుకు వెళ్తా ఉన్నాం. ఇందులో మా స్లోగన్ ఒకటే... "చెప్పాం, చేస్తున్నాం". 2024 ఎన్నికల సందర్భంలో ఏదైతే చెప్పామో అంతకన్నా ఎక్కువే చేసుకెళ్తున్నాం తప్పించి ఇందులో వెనక్కి తగ్గేదే లేదు అనే ఆలోచనతో ఇవాళ కూటమి ముందుకు వెళ్తా ఉంది. అందుకోసం ఇవాల్టి నుంచి ఈ ప్రచార కార్యక్రమం "చెప్పాం, చేస్తున్నాం" అనే ప్రచార కార్యక్రమాన్ని తీసుకొని ప్రజల ముందుకు వెళ్తా ఉన్నాం.ఇవాళ ముఖ్యంగా ఆలోచన చేస్తే ఇవాళ అమరావతి గానీ పోలవరం గానీ ఏ విధంగా శరవేగంగా ముందుకు వెళ్తా ఉన్నాయో చూస్తున్నారు. మరో పక్క రోడ్స్ నిర్మాణం పెద్ద ఎత్తున రోడ్స్ నిర్మాణం జరుగుతా ఉంది. ఇవాళ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే అభివృద్ధి జరుగుతుంది అని ఆరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారో దానికి అనుగుణంగానే ఈరోజు డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తా ఉందని ఇవాళ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలందరూ కూటమిని గెలిపిస్తే త్రిబుల్ ఇంజన్ సర్కార్ తో ముందుకు వెళ్తాం. పార్లమెంటు, అసెంబ్లీబి స్థానిక సంస్థలు మూడు కలిసి త్రిబుల్ ఇంజన్ సర్కార్ తో అద్భుతమైన ప్రగతి సాధించడం కోసం ఇవాళ ముందుకు వెళ్తున్నామన్నారు.

ఈ సమావేశంలో అనపర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి,అనపర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ మర్రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శింగనమలలో వైఎస్సార్‌సీపీ ముఖ్య సమావేశం. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై సమీక్ష.....



**అంకుశం న్యూస్,శింగనమల, అక్టోబర్:19** శింగనమల మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వాసవి కళ్యాణ మండపంలో డాక్టర్ సాకే శైలజానాథ్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక, పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ఎన్నికల్లో సమర్థవంతంగా ముందుకు సాగేందుకు అవసరమైన అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి బొమ్మన శ్రీరామ్ రెడ్డి, శింగనమల మాజీ జడ్పీటీసీ కంచి రెడ్డి భాస్కర్ రెడ్డి, శింగనమల నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎం. వీరాంజనేయులు తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

## ప్రజలందరికీ విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



**అంకుశం న్యూస్ ఉరవకొండ అక్టోబర్ 19** విజయదశమి పండుగ సందర్భంగా ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి ప్రజలందరికీ ముఖ్యంగా తెలుగు ప్రజలు, ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు , మరియు ఉరవకొండ నియోజకవర్గం ప్రజలందరికీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హిందువుల పండుగల్లో విజయదశమికి ఉన్న ప్రత్యేకతే వేరు. చిన్నా పెద్దా, పేదా గొప్పా అనే బేధం లేకుండా అందరూ కలసి ఊరూ వాడా సంబరంగా జరుపుకునే పండుగ ఇది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో నవరాత్రుల పేరుతో ఆ జగజ్జననికి ప్రత్యేక అలంకరణలు చేస్తూ ఆరాధిస్తూ తమ మొక్కుబడులను చెల్లించుకుంటారని, విజయదశమి రోజు తమ ఇంట్లో పెద్దలకు బట్టలు పెట్టుకుని కుటుంబమంతా కలిసి జరుపుకునే పండుగ విజయదశమి అని, ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితలాలలో సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించి అందరిని సంతోషంగా ఉండేలా ఆ జగన్మాత ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులకు సకాలంలో వర్షాలు పడి, పండించిన పంటలు దిగుబడి బాగా వచ్చి, గిట్టుబాటు ధర పలికి వారి జీవితాలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని , మరొకసారి మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజలందరికీ విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీసత్యసాయి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధం

**ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి**

**ప్రశాంత, పారదర్శక వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు**

**స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పి. అరుణ్ బాబు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తిపుట్టపర్తి, అక్టోబర్ 19:** శ్రీసత్యసాయి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికలు--2026ను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పి. అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆదివారం పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పి. అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పి. అరుణ్ బాబు, అనంతపురం జిల్లా అటవీ శాఖాధికారి డి. రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొని ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని పరిశీలకులు సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

**పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి**

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన భద్రత కల్పించాలన్నారు.

**ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఏర్పాట్లు పూర్తి చేయాలి**

ఎన్నికల విధులకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయంతో ఎన్నికలు విజయవంతం చేయాలి**

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ప్రతి దశలో నిబంధనలను పాటిస్తూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్ పి అంకిత సురన,డిఆర్ఓ కొండయ్య, జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య,డిపిఓ వెంకట రత్నం,డిడబ్ల్యుఎంఏ పిడి విజయ్ ప్రసాద్,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా ఆయుధ పూజ

**దుర్గామాత చిత్రపటం, ప్రతిమలకు జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేకప్రత్యేక పూజలు**





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం అక్టోబర్ 19** అనంతపురం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఈరోజు ఘనంగా ఆయుధ పూజ జరిగింది. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా ప్రజలు మరియు జిల్లా ఢ రాష్ట్ర పోలీసులు సుఖఃశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ పి.జగదీష్ లి ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలోని పోలీసులు దైనందిన విధుల్లో వినియోగించే అన్నిరకాల ఆయుధాలకు... మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా లిఎస్పీ జగదీష్ మాట్లాడుతూ . దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, పోలీసులు... ఇలా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలని... జిల్లా పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు. ఆయు:రారోగ్యాలు, అభివృద్ధి జరగాలన్నారు. ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈకార్యక్రమాలలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ ఏఎస్పీ అశ్విన్ మణిదీప్ , డీఎస్పీలు కరుణాకరరావు, నీలకంఠేశ్వరరెడ్డి (ఏ.ఆర్) డిపిఓ ఏ.ఓ రవిరాంనాయక్ , సి.ఐ లు క్రాంతికుమార్ , వలుబాష, ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్ , పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోకనాథ్ , ఆర్ఎస్ఐ జాఫర్ , లక్ష్మినారాయణ, ఆర్ఎస్ఐ బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ 'సెలెస్ట్'లో కోలాహలంగా దసరా సంబరాలు



**అంకుశం న్యూస్ విశాఖపట్నం, అక్టోబర్ 19:** విశాఖపట్నం నగరంలోని అతిపెద్ద కాలనీల్లో ఒకటైన గాజువాక 'సెలెస్ట్'లో గత వారం రోజులుగా దసరా సంబరాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ప్రధానంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు బాలగోపాలాన్ని అలరిస్తున్నాయి. పలు రాష్ట్రాల విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహిస్తున్న కళారూపాల ప్రదర్శనలో సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు కుమార్తె, హెచ్‌పీసీఎల్ ఉద్యోగి వేదుల రాఘవేంద్ర సతీమణి, ట్రాన్స్‌కో ఉద్యోగిని శ్రీమతి వేదుల లలితా జ్యోతి మనవరాలు చి. కృత్తిక, నీటి పొదుపుపై నృత్యరూపకాన్ని ప్రదర్శించిన చి. వేదుల కార్తికేయ తమ కళానైపుణ్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోంది రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత....





**అంకుశం న్యూస్, రాప్తాడు, అక్టోబర్:19** 2024 ఎన్నికల్లో ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి ఆమె 'చెప్పాం.. చేస్తున్నాం' అనే ప్రగతి నివేదిక కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా గృహ నిర్మాణం కింద 1,707 ఇళ్ళు, 4,334 మందికి ఇంటి స్థలాలు, 2,475 తాగునీటి కనెక్షన్లు, 13,261 విద్యుత్ కనెక్షన్లతో పాటు 7,260 మందికి నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. మౌలిక వసతుల పరంగా నియోజకవర్గంలో 149 కి.మీ. ఇంటి ముందు రోడ్లు, 46 కి.మీ. ప్రధాన రహదారులు, 12 కి.మీ. డ్రైనేజీ పనులతో పాటు కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో రాప్తాడు నియోజకవర్గం అగ్రగామిగా ఉందంటూ---ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద రూ. 624.68 కోట్లు, తల్లికి వందనం ద్వారా రూ. 147.75 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 136.98 కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందజేశామని సునీత తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలో 4.60 లక్షల అన్న క్యాంటీన్ భోజనాలు, దీపం 2.0 కింద 97,123 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగిందని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా సాగుతోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఏవైతే హామీలు ఇచ్చామో, ఆ హామీలను నూటికి నూరు శాతం తప్పకుండా అమలు చేసి చూపిస్తున్నామని ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను వివరించారు. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వంటి 34 ప్రత్యేక విభాగాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సదస్సులు నిర్వహించాలన్నారు. ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి స్థానిక సంస్థల ఓటర్ల మద్దతు కోరుతూ ఒక వీడియో రికార్డ్ చేయాలన్నారు. ఐటీ టీమ్ ఆధ్వర్యంలో 'మై టీడీపీ' యాప్ ద్వారా ఈనెల 27 వరకు జరిగే ఇంటింటి ప్రచారాన్ని, ప్రజల స్పందనను, లబ్ధిదారుల టెస్టిమోనియల్స్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రచారాన్ని పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

## దసరా ప్రత్యేక పూజలు అందుకున్న నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 19** దసరా దేవీ నవరాత్రి వేడుకలు సందర్భంగా చేనేత ఆరాధ్య దైవం శ్రీ నందవరం చౌడేశ్వరి దేవి కి తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు చేసారు. ఈ కార్యక్రమం లో ధర్మవరం నుండి నందవరం వెళ్లి అక్కడ దశరా దేవీ నవరాత్రి వేడుకలు లో పాల్గొన్నట్లు ధర్మవరం చేనేత ప్రముఖులు దాశెట్టి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో దాశెట్టి నారాయణ స్వామి దాశెట్టి సుబ్రహ్మణ్యం మరియూ దాశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దసరా సందర్భంగా ధర్మవరం చేనేతలు అందరికీ దాశెట్టి నాగరాజు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**కనిగిరి అక్టోబర్ 19 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ నాయకత్వంలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీలోని విజయవాడలో వివిధ వ్యాపారాల రిత్యా నివాసముంటున్న సుమారు 50 కుటుంబాల వారు ఒకే త్రాటి పై వచ్చి ఎంపీటీసీ, జడ్పిటిసిలను మండలంలోనే భారీ మెజారిటీతో గెలిపించుకుందామని జంగాలపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు మానం మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెనికల సురేష్, చెనికల మధు, చెనికల శ్రీకృష్ణ, మానం రాజేంద్ర, చెనికల మనోజ్, చెనికల మల్లికార్జున, చెనికల ఆవులయ్య, మానం కిరణ్, చెనికల మహేష్, మానం మహేష్, చెనికల వెంగళరావు, చెనికల శ్రీను, నూతలపాటి రాము, చెనికల రామయ్య, చెనికల నాగార్జున, మానం విజయ్ కుమార్, మానం నాని, మానం సాయి, చెనికల నాగేశ్వరరావు, మక్కా నాగరాజు, నూతంగి నరసింహారావు, చెనికల చిన్న మాల కొండయ్య, చెనికల రమణ, అద్దంకి మల్లికార్జున, అద్దంకి ఉమామహేశ్వర్, చెనికల వెంకటేశ్వరరావు (బచ్చు) పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**కనిగిరి అక్టోబర్ 19 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అశ్వయుజ శుద్ధ దశమి రోజున విజయదశమి (దసరా) పండుగను జరుపుకుంటారని, తొమ్మిది రోజులు శరన్నవరాత్రుల తో పాటు భక్తులు అమ్మవారిని ఆరాధిస్తారని, పదవ రోజున దుర్గాదేవి మహిషాసురుడిని వధించి లోకానికి రక్షణ కల్పించిన సందర్భాన్ని విజయదశమి గా జరుపుకుంటారని, అశ్వయుజ దశమి శ్రవణా నక్షత్రంతో కూడి ఉన్నందున దీనికి విజయ అనే పేరు వచ్చిందని, ఈరోజు ఏ కొత్తపనినైనా ప్రారంభిస్తే విజయం తథ్యం అని నమ్ముతారని, విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించి, జమ్మి బంగారం పంచుకోవడం మన సాంప్రదాయమని, ఇది ఐశ్వర్యాన్ని పరస్పర బంధాలను బలపరుస్తుందని, దసరా పండుగ రోజున పాలపిట్టను చూడడం అత్యంత శుభప్రదంగా భావిస్తారని దారపనేని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందోత్సవాలతో దసరా పండుగను జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.

## నగరంలో ప్రచార భేరి మోగించిన కూటమి ప్రభుత్వం....





**అంకుశం న్యూస్, అనంతపురం, అక్టోబర్:19** 48వ డివిజన్ నుంచి ప్రచారాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ , ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కూటమి నాయకులుఇంటింటికీ తిరిగిన సత్యకుమార్ దగ్గుబాటి ప్రసాద్ మేయర్ అభ్యర్థి అజేష్, 48వ డివిజన్ టీడీపీ అభ్యర్థి సంగీత గారిని గెలిపించాలని విజ్ఞప్తి ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న కూటమి శ్రేణులు ఎన్నికల విషయంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై సత్యకుమార్ గారు తీవ్ర ఆగ్రహం.గతంలో చేసిన అరాచకాలు మర్చిపోయి జగన్ మాట్లాడుతున్నారు.నవ్విపోదురుగాకా నాకేంటి సిగ్గు అన్న విధంగా ఉంది ఆయన తీరు ఆయన రెచ్చగొడుతారు, కవ్వింపులు చేస్తారు..మళ్లీ ఆయనే ఫిర్యాదు చేస్తారు.ఓటమి భయంతోనే జగన్ గొడవలు రేపుతున్నారు.రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌లను జగనే తెచ్చారు.వ్యవస్థలను అవమానిస్తూ జగన్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు.మళ్లీ ఫ్యాక్షన్ కక్షలను రెచ్చగొట్టాలని చూస్తున్నారు,జగన్ రెడ్డి క్షమాపణ చెప్పకపోతే భూస్థాపితం తప్పదు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ హామీకి కట్టుబడి ఉన్నాం. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.కేంద్రం, రాష్ట్రం, అలాగే స్థానికంగా ఒకే ప్రభుత్వం ఉండాలిట్రిబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే వేగంగా అభివృద్ధి రెండున్నరేళ్లలో 1300 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు300 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తి చేశాంరాష్ట్రానికి 25 లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చాయి.పుట్టపర్తికి యుద్ధ విమానాల పరిశ్రమ తరలివచ్చింది.హంద్రీనీవా నీరు కుప్పం, మడకశిర వరకు తీసుకెళ్లాం.ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే మరింత ప్రగతి.ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక సామాన్య మధ్యతరగతికి చెందిన బీసీ వ్యక్తికి అవకాశం ఇచ్చారు.మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ గత ప్రభుత్వం యువత జీవితాలను నాశనం చేసిందియువతను గంజాయి, దందాల వైపు నడిపించారు విధ్వంసాలు చేసినందుకే 11 సీట్లకు పరిమితం చేశారు కేంద్ర సహకారంతోనే గతంలో 300 కోట్ల బ్రిడ్జి నిర్మాణం అనంతపురం నగరాన్ని క్లీన్‌గా తీర్చిదిద్దుతాం. గెలిచిన వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొస్తాం అజేష్ యాదవ్ పేర్కొన్నారు.